ఎదురుగా ఆ విషయం చర్చించటం యిష్టంలేక "చూడు లక్ష్మి – యీ అమ్మాయి గార్కి అతిథి గదులలో ఓ గది చూపించి ఆమెకేం కావాలో అన్నీ ఏర్పాట్లుచూడు. ఆమెకి కాఫీ ఫలహారాలు ఇయ్యి. శ్యామలా లక్ష్మి నీగది చూపిస్తుంది వెళ్ళిసామాను సరుకో' అని పనిమనిషితో శ్యామలని అక్కడనించి పంపేశాడు. తరువాత తల్లి ప్రశ్నలకి అన్నీ చెప్పాడు. ఎక్సిడెంటు – శ్యామల అనాధ శరణాలయంలో పెరిగిన విషయం అన్నీ చెప్పాడు.

"బాగానేవుంది. ఏక్సిడెంట్ జరిగితే ఏదీ డబ్బు మాట చెప్పేస్తే సరిపోయే దానికి యింట్లోకి తీసుకురావడం ఎందుకు – ఏ కులమో–ఎవరో ఏం తెలియనిదాన్ని తీసుకొచ్చి అందలం ఎక్కించడం బాగాలేదు. యిప్పుడు వున్నవారు చాలరా ఎందరుంటేమాత్రం ఇల్లాలుసాటి అవుతారా – ఏమో నాకేం నచ్చలేదు – 'ఆవిడ ఖచ్చితంగానే అంది.'

తల్లి అలా మాట్లాడుతూంటే అంగీకరింపజెయ్యలేని అసహాయత రంగా రావుకి కోపం తెప్పించింది. ఆ విషయం పెంచకుండా "ఏమో – ఆ అమ్మాయి నాకు నచ్చింది మంచిదానిలా కన్పించింది. యిల్లు వాకిలి బాగా చూస్తుందన్న నమ్మకం కల్గి వెంటబెట్టుకువచ్చాను – మీకు అవసరం లేదంటే మీ పని చూడదు– యింట్లో మిగతావి చూడమని చెపుతాను –' రంగారావు దృఢంగా అని అక్కడ నుంచి వెళ్ళిపోయాడు– కొడుకు తనకి తోచింది తప్ప మరొకటి చేసే రకం కాదు అని ఆవిడకి తెల్సు కనక కొడుకు అంత ఖచ్చితంగా అభిప్రాయం చెప్పినపుడు యింక మాట్లాడేందుకు ఏమి లేక ఊరుకుంది జమీందారిణి.

* * *

శ్యామల పట్ల మొదట్లో తిరస్కార భావం గల్గినా అతి కొద్దిరోజులలో ఆమె పట్ల భావం మార్చుకోలేక తప్పలేదు. జమీందారిణికి. అతివినయంగా, శ్రద్ధగా ప్రతి విషయం తనదిగా చూస్తూ పనిచేస్తున్న శ్యామలని ఆవిడ మనసులో మెచ్చుకో కుండా ఉండడం కుదరలేదు. వచ్చి నెలరోజులు కాకముందే ఎన్నాళ్ళగానో ఇంట్లో ఉన్నట్టు ఇల్లు చక్కదిద్దడం. ఆ తెలివి, ఆ శుభ్రత అంతా చూసాక జమిందారిణి కొడుకు మంచిపనే చేశాడన్న నమ్మకం కల్గింది.

భార్య పోయిం దగ్గరనుంచి కేవలం నౌకర్లమీదే ఇల్లంతా వదిలేశారు రంగారావు. ఇల్లంతా అదోరకం పాడుపడినట్లు, దుమ్ముకొటుకు పోయినట్లు ఉండే

భవంతి శ్యామల ఆధ్వర్యంలో తిరిగి జీవం వచ్చి కళకళ లాడసాగింది. పనివాళ్ళు బద్దకం వదిలి వళ్ళు వంచాల్సి వచ్చింది. ఖర్చు అదుపులోకి వచ్చింది. అన్నింటిలో వున్నానంటూ శ్యామల ఇంట్లో తిరుగుతుంటే ఇల్లాలు లేని లోటు కనపడడం లేదు ఇప్పుడు.

ఒక రెండునెలల్లో ఇంట్లోవచ్చిన మార్పులు చూసి రంగారావు చాలా సంతోషించారు. శ్యామల రాకతో ఇంటికే కాక తమకూ పట్టిన తుప్పు వదిలినట్లనిపించింది ఆయనకి. ఇదివరకు పట్టుమని రెండు రోజులు కూడా ఆ వూర్లో ఉండకుండా ఎక్కడెక్కడో తిరిగే ఆయన నెలరోజులుగా ఇల్లు కదలలేదు.

శ్యామల రాక పనివాళ్ళల్లో చాలా సంచలనాన్నే కల్గించింది. ముందు ఎవరో అనుకున్నారు-తరువాత శ్యామల శరణాలయంలో అనాధగా పెరిగిందన్న నిజం గుర్తించాక వారి దృష్టిలో చులకన అయింది. కాని జమిందారు స్వయంగా వెంటబెట్టుకు రావడం-పనివాళ్ళ అజమాయిషీ-యింటి ఖర్చులు ఆమె చేతికి వదలడం చూశాక గుసగుస లాడుకున్నారు-ఎవర్తో అనాధ తమమీద అధికారం చెలాయించడం వారందరికి కోపకారణం అయింది. ఎన్నిఏళ్ళుగానో జమిందారులకు సేవచేస్తూన్న తమందరూవున్నా ఈనాడు ఎవర్తోవచ్చి తమని ఆజ్ఞాపించడం సహించలేక పోయారు. శ్యామల అధికారం ఆ ఇంట్లో చెల్లదని చూపించ దలిచారు. అంతా కలిసి ఒక ఉమ్మడిగా శ్యామల అధికారాన్ని నిరసించారు. ఎవరికి ఏ పని చెప్పి చేయించడం శ్యామలకి దుస్సాధ్యమైంది-ఆ విషయం రంగారావుగారికి ఎలా చెప్పాలో ఆమెకి తెలియలేదు-పనివాళ్ళ గుసగుసలు వ్యంగ్యోక్తులు ఆమెని బాధించినా-ప్రతీపని తను వంటరిగా చేసుకోవలసి రావడం కష్టం అనిపించినా ఏనాటినించో ఉన్న వాళ్ళందరి మీదా నేరాలు చెప్పడం ఆమెకి యిష్టం లేకపోయింది. రంగారావు ఎప్పటికప్పుడు 'శ్యామలా నీ కిక్కడ సదుపాయంగా వుందా-అంతా సరిగా జరుగుతూందా-దేనికి ఇబ్బంది లేదుకదా' అని అడిగేవారు. శ్యామల తలాడించేది. యింట్లో శ్యామల ఎదుర్కొంటున్న తిరస్కారాలు, అవమానాలు ఆయనంతట ఆయన చూసేవరకు తెలియలేదు.

ఓరోజు జమీందారు ఇంకోవూరి జమీందారుగారితో కలిసి వేటకి వెళ్ళారు. మూడోరోజు రావల్సిన ఆయన రెండోరోజు సాయంకాలానికే వచ్చారు. శ్యామల చీర ఎగగట్టి కొంగుదోపి హాలంతా చీపురుతో తుడుస్తూ – సోఫాలని ఒక్కర్తీ అవస్థ

పడుతూ లాగుతుంది. పనివాళ్ళందరూ కూర్చుని మాట్లాడుతూ పెద్దగా నవ్వుకుంటు న్నారు. ఆయన ఒక్క క్షణం అలా వుండిపోయారు శ్యామల పెద్ద సోఫా ఒకటి లాగలేక 'నర్సింలూ కాస్త ఈ సోఫా అక్కడ పెడతావా' అంది. నర్సింలు ఎక్కసంగా 'వోయబ్బ ఈ మహారాణి సుకుమారి – యీవిడగారి క్రింద మరో నౌకరీ వాడుకావాలా ఎల్లు ఎల్లు నీ మోతిక్రింద మేము పడిలేం – నీవేటి సెబితే అది చేయడానికి' అంటూ శ్యామల ఎదుటే బీడి పొగ వదిలాడు. రంగారావు కోపం పట్టలేక హాలులోకి వచ్చి 'నర్సింలూ అని పొలికేక పెట్టారు. నర్సింలు బిక్క చచ్చి పోయాడు. పనివాళ్ళంతా ఆ హఠాత్ సంఘటనకి దిమ్మెరపోయి నిలబడ్డారు శ్యామల ఏం చెయ్యాలో తెలియనట్లు గాబరాపడింది. "ఏమిటిరా కూశావ్. ఆమె ఎవరను కుంటున్నావురా–" వళ్ళు తెలియని ఆగ్రహంతో ఆ యన మాట తడబడింది "శామలా యీ పనులన్నీ నీవే చేస్తున్నావా– వీళ్ళెవరూ పనిచెయ్యడం లేదా సరిగా. మరి ఈ విషయం నాకెందుకు చెప్పలేదు. ఈ వెధవ లందరిని తిని కూర్చోపెట్టి మేపడానికా. వీళ్ళు నీమాట వినటం లేదన్న సంగతి నాకెందుకు చెప్పలేదు. శ్యామల తలదించుకుంది. "ఏం చెప్పను ? ఎలా చెప్పను. పనివాళ్ళెవరికి నా రాకయిష్టంలేదు. వాళ్ళమీద నేను అధికారం చెలాయిస్తున్నానని కోపం. నా మాట ఎవరూ వినటం లేదు. నన్నేం చెయ్యమంటారు ? దీనంగా అంది.

"అయితే ఇన్నాళ్లూ నీవక్కరివే చేస్తున్నావన్నమాట – ఈ పనులు – నా కెందుకు చెప్పలేదు శ్యామలా – చెపితే ఈ వెధవలందరిని తన్ని తరిమేసేవాడిని"

'బాబుగారు – పాతికేళ్ళబట్టి మీ ఉప్పు తిని బతుకుతున్నాం – యింటి యజమానుల మాట మేం యింటాం గాని – ఎవర్నో తీసుకొచ్చి మా నెత్తిమీద పెడితేయేం యినమండి–' నర్సింలు కాస్త పొగరుగా ధిక్కరించాడు.

'ఏరేయ్ – మర్యాదగా మాట్లాడు – శ్యామలకి అధికారం నేనిచ్చాను. ఆమె మాట విననివాళ్ళు యిక్కడ ఒక్క క్షణం వుండడానికి వీలులేదు. యిష్టం లేనివారంతా బయటికి పొండి తక్షణం .' ఉద్రుడై అరిచాడు రంగారావు.

ఆ తరువాత ఆయన ఎవరినీ ఉపేక్షించలేదు – అన్నాళ్ళు కొలువు వదులు కొని పోలేనివారంతా చచ్చినట్టు పడివుండక తప్పలేదు. శ్యామల ఆజ్ఞలు పాటిం చక తప్పలేదు వాళ్ళకి. అలా అని శ్యామల ఎవరిని చులకన చెయ్యలేదు–తనూ వాళ్లల్లో ఒకరిగా కలిసి పనిచేసేది – చేయించేది – క్రమంగా శ్యామల కార్య

దీక్షత - మంచితనం గ్రహించి వాళ్ళందరూ శ్యామలని అభిమానించ సాగారు. అంతేకాక శ్యామల చెపితే జమీందారు ఏదన్నా వింటారని - తమకు ఏం కావచ్చినా శ్యామలకే చెపితే అయి తీరుతుంధని గ్రహించాక శ్యామలపట్ల గౌరవం చూపక తప్పలేదు వాళ్ళకి.

ఆవిధంగా రెండు మూడు నెలల్లో శ్యామల ఆ ఇంటివి ఓ కొలిక్కి తీసు కొచ్చి పనివాళ్ళల్లో క్రమశిక్షణ తెచ్చింది. దూబారా ఖర్చులు తగ్గాయి. అన్నీ ఏర్పాటులు ఇదివరకు కంటే బాగా వున్నాయి, జమీందారిణి వుండే రోజుల్లో ఆవిడా ఓ జమీందారు బిడ్డ. పనివాళ్ళమీద అధికారం చూపడం తప్ప అభిమానం చూపలేదు, స్వయంగా ఏపని చూడడం అలవాటులేదు. అంచేత ఆమె ఉన్నప్పుడు ఖర్చులు సగానికి సగం ఖర్చుతగ్గింది. రంగారావు చాలా సంతృప్తి పడ్డాడు. శ్యామల పట్ల ఆయనకి అభిమానం, ఆకర్షణ రోజురోజుకీ పెరిగాయి. ఆమెని ఓ ఉద్యోగస్తు రాలిగా కాక ఇంటి సభ్యురాలిగా ఆయన ప్రతి విషయంలో ఆమె సలహా సంప్ర దింపులు చేయసాగారు. "శ్యామలా శ్యామలా" అంటూ దేనికో దానికి తరుచు పిలుసారు. శ్యామల స్వయంగా ఆయన గది సపరిస్తుంది. బట్టల విషయం చూస్తుంది. కాఫీ తెస్తుంది. ఆయన కిష్టమైన పదార్థాలు అడిగి తనే వండి దగ్గరుండి వడ్డిస్తుంది. భార్యకూడా చూపని శ్రద్ధాసక్తులు శ్యామల చూపిస్తుంటే ఆమె సేవాపరాయణత, ఆమె భక్తి ఆయనని శ్యామల రోజురోజుకి ఆకట్టుకోసాగింది.

సాయంత్రం తోటలో కుర్చీలువేసి టీ తాగుతూ శ్యామలనీ కూర్చోమని టీ తాగేవారు ఆమెతో. బ్యాట్మెంటన్ కోర్టులో తమతోపాటు ఆడమనేవారు. ఏం తోచడంలేదు పేకాడుదాం అనేవారు-యెవరైనా మిత్రులువస్తే వారితో శ్యామలని తమ బంధువుగా పరిచయంచేసి వారి సరసన ఆమెనీ కూర్చోపెట్టే వారు. విందులకీ వినోదాలకీ శ్యామల రాకతో ఆయన భార్యాబిడ్డల వియోగం మరిచిపోగలిగారు - ఇప్పుడిప్పుడు ఆయన మనసారా నవ్వగలుగుతున్నారు. ఆయనలో గూడుకట్టిన నిర్లి ప్తత, విరక్తి తొలగిపోయి బతుకుపట్ల నూతనోత్సాహం కలసాగింది.

శ్యామల అయితే రంగారావుచూపే ఆదరాభిమానాకి తబ్బిబ్బు అయి పోయింది. ఆయనతో సమంగా జమిందారీ స్థాయిలో తనని గౌరవించడం చూసి కృతజ్ఞతతో ఆమె మనసు నిండిపోయింది. చూడడానికి అంత గంభీరంగావుండే మనిషి హృదయం ఇంత సున్నితమైనదని తెలిశాక ఆమె భక్తి - ఆరాధన